www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 30 ఏప్రిల్ 2024 | 8 పేజీలు



తూర్పుగోదావరి



కాకినాడ



కోనసీమ

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

▶ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిళ ▶ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం, కాకినాడ ప్రతినిధులు

కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేక హోదా సాధ్యమని, పోలవరం నిర్మాణం పూర్తి కావాలన్నా, రాజధాని కావాలన్నా, బిడ్డల భవిష్యత్తు బాగుండాలన్నా ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిళ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులో సోమవారం నిర్వహించిన సభలో ఆమె ప్రసంగించారు. మతతత్వ బిజెపి పార్టీని వైయస్ రాజశేఖరరెడ్డి వ్యతిరేకించారని గుర్తు చేశారు. గోద్రా ఘటనలో ఉతికి ఆరేశారని వివరించారు. మణిపూర్‌లో ఘోరం జరిగినా వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదన్నారు. అటువంటి బిజెపితో అక్రమ పొత్తు పొట్టుకున్న జగన్ మోహనరెడ్డి రాజశేఖరరెడ్డి వారసుడా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊపిరి లాంటిందని వివరించారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, రాజధానితో పాటు రాష్ట్రంలోని బిడ్డల భవిష్యత్తును బిజెపికి తాకట్టు పెట్టారన్నారు.



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న వైఎస్.షర్మిళ, చిత్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

చంద్రబాబు అమరావతి పేరుతో భ్రమరావతి సృష్టించారని, వైయస్ జగన్ మూడు రాజధానులలో ఒక్కటైనా నిర్మించలేదని ఎద్దేవా చేశారు. అదే పార్టీతో ఒకరు పొత్తు, మరొకరు తొత్తులుగా మారి ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని అన్నారు. జాబ్ క్యాలెండర్ పేరు చెప్పి ఒక్కటి కూడా విడుదల చేయలేదని, రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చా రంటూ విమర్శిం చారు. బిజేపీని ఎదుర్కోగల ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్ర మేనని తెలిపారు. రంప చోడవరంలో సిపిఎం అభ్యర్థి లోతా రాంబాబును, రాజ మహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గుడుగు రుద్ర రాజుతో పాటు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబుకు కూటమికి ఓటేసినా, వైయస్ జగన్‌కు ఓటేసినా ఢిల్లీ నుంచి అమిత్‌షా రాష్ట్రాన్ని పరిపాలిస్తాడని హెచ్చరించారు. రాష్ట్రంలో బిజెపికి కనీస ఓటు బ్యాంకు లేకపోయినప్పటికీ పోటీ పడి మద్దతు తెలపడంలో ప్రజా ప్రయోజనం లేదని వివరించారు. రాష్ట్ర భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం అని తెలిపారు. రాష్ట్రాన్ని బిజెపి చేతిలో పెడితే సర్వనాశనం చేస్తారని అన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతసామరస్యం, దేశసమైక్యత వంటి 2లో..



కాకినాడలో రోడ్‌షో



రంపచోడవరం సిపిఎం అభ్యర్థి లోతా రాంబాబును పరిచయం చేస్తున్న షర్మిళ



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి


బాబుకు ఓటేస్తే నవరత్నాలు దూరం

అంబాజీపేట సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అంబాజీపేట

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే నవరత్నాలు పేదలకు దూరం చేస్తాడని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేటలో నిర్వహిం చిన ఎన్నికల ప్రచార సభలో సిఎం జగన్ మోహన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం వరకు అమలు చేశామని, మళ్లీ వైసిపికి ఓటేస్తే ఈ పథకాలు కొనసాగుతాయని అన్నారు. రానున్న ఎన్నికలు చంద్రబాబు జగన్‌కు కాదని పేద ప్రజలకు పెత్తందారులకు మధ్య సాగే యుద్ధమని సిఎం జగన్ అన్నారు. పేదలకు మంచి చేయడమే తన నైజమని తను ఒక్కడు ఒకవైపు, కూటమి పేరుతో మోసాల చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ బిజెపితో జతకట్టారని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో పేద ప్రజలకు మేలు చేసేందుకు నవరత్నాల పేరిట 32 సార్లు బటన్ నొక్కి రూ.2 లక్షల 31 వేల కోట్లను డిబిటి ద్వారా పేద ప్రజల ఖాతాల్లో నగదు జమ చేశారని ఆయన అన్నారు. ఇదే కూటమి 2014లో ఎన్నికల హామీలు అంటూ ప్రజల్లోకి వచ్చి రకరకాల హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చి ఒక్క హామీ అయినా అమలు చేశారా అని జగన్ ప్రశ్నించారు. వాలంటీర్లు ఇంటికి రావాలన్నా మన పిల్లల చదువులు బాగుపడాలన్నా వ్యవసాయం, ఆసుపత్రులు, మెరుగు పడాలన్నా రెండు బటన్‌లు ఫ్యాన్ గుర్తుపై నొక్కి పి.గన్నవరం నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ బహిరంగ సభ కార్యక్రమంలో మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్, మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరీ దేవి, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, మంతెన రవిరాజు, మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా...

ఎన్నికల బరిలో 297 మంది

▶ పార్లమెంట్‌కు 43 మంది

▶ అసెంబ్లీ స్థానాలకు 254 మంది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి బరిలో మొత్తంగా 297 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అమలాపురం, కాకినాడ, రాజమండ్రి పార్లమెంట్ స్థానాలకు 43 మంది పోటీ పడుతుండగా, 21 అసెంబ్లీ స్థానాలకు 254 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నామినేషన్‌లో ఉపసంహరణ ముగియడంతో తుది జాబితాను అధికారులు ప్రకటించారు.

కాకినాడ జిల్లాలోని ఒక పార్లమెంటు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 108 మంది బరిలో నిలిచారు. ఇందులో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గానికి 15 మంది, 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 93 మంది మొత్తం 108 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరిగింది. 26న వాటిని పరిశీలించారు. 29 వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాలను సోమవారం రాత్రి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జె.నివాస్ విడుదల చేశారు. బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. కాకినాడ పార్లమెంటు స్థానానికి మొత్తం 28 మంది నామినేషన్లు దాఖలు చేయగా 10 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 18 నామినేషన్లు చెల్లుబాటు అవ్వగా వీరిలో ముగ్గురు ఉపసంహరించుకున్నారు. చివరగా 15మంది పార్లమెంటు బరిలో ఉన్నారు. తుని నియోజకవర్గం నుంచి 11 మంది అభ్యర్థులు, ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి 15 మంది, పిఠాపురం నియోజకవర్గం నుంచి 13 మంది, కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి 15 మంది, పెద్దాపురం నియోజకవర్గం నుంచి 10 మంది, కాకినాడ పట్టణం నియోజకవర్గం నుంచి 15 మంది, జగ్గంపేట నియోజకవర్గం నుంచి 14 మంది ఎన్నికల పోటిలో నిలిచారు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ బరిలో 106 మంది అభ్యర్థులు నిలిచారు. మొత్తంగా 151 నామినేషన్లు దాఖలు కాగా అందులో 120 అర్హత సాధించాయి. 14 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. వీటిలో పార్లమెంట్ బరిలో 21 నామినేషన్లు దాఖలు కాగా 5 తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 16 మందిలో ఒకరు ఉపసంహరించుకోవడంతో 15 మంది బరిలో నిలిచారు. రామచంద్రపురంలో ముగ్గురు నామినేషన్లు ఉపసంహించుకోవడంతో 13 మంది, ముమ్మిడివరంలో ఇద్దరు ఉపసంహరించుకోవడంతో 15 మంది, అమలాపురంలో ఐదుగురు ఉపసంహించుకోవడంతో 13 మంది, రాజోలులో ఒకరు ఉపసంహరించుకోవడంతో 10 మంది, పి.గన్నవరంలో ఒకరు ఉపసంహరించుకోవడంతో 14 మంది, కొత్తపేటలో ఒకరుఉపసంహరించుకోవడంతో 13 మంది, మండపేటలో 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

విస్తృతంగా సుభాష్ ప్రచారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గంలో తాళ్లపొలెం అపార్ట్మెంట్స్, రాజబాబు నగర్, ప్రాంతాల్లో సోమవారం టిడిపి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. అనంతరం పలువురు పార్టీలో చేరారు.

తాళ్లపూడిలో తలారి ప్రచారం

ప్రజాశక్తి-తాళ్లపూడి

వైసిపి కొవ్వూరు నియోజకవర్గం అభ్యర్థి తలారి వెంకట్రావు సోమవారం మండలంలోని వేగేశ్వరపురం, బల్లిపాడు, అన్నదేవరపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ 2019 మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసినట్లుగానే 2024 మేనిఫెస్టో హామీలను కూడా నూరు శతం అమలు చేయగల ధైర్యం సిఎం వైఎస్.జగన్‌కు మాత్రమే ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పలు గ్రామాల్లో ముప్పిడి ప్రచారం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం మండలంలోని రాగోలపల్లి, తుపాకులగూడెం, పోచవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అది ప్రజల అండదండలతోనే సాధ్యమని చెప్పారు. ఈ ప్రచారంలో ముప్పిడి వెంట టిడిపి నాయకులు చలపాటి ప్రకాష్, అనపర్తి ప్రసాద్, కాకర్ల సురేష్, ఐతం మణికంఠ తదితరులు ఉన్నారు.

బిఎస్‌పి అభ్యర్థి చిత్రసేను ప్రచారం

ప్రజాశక్తి - నిడదవోలు

ఇంటింటి ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఎస్‌పి ఎంఎల్‌ఎ అభ్యర్థి చిత్రసేను కాటకోటేశ్వరం, ఉనకరమెల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా చిత్రసేను మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన రూ.లక్షా 11 వేల కోట్ల ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను జగన్ ప్రభుత్వం నిస్సిగ్గుగా దారిమళ్లించి ఎస్‌సి, ఎస్‌టిల నోటిలో మట్టి కొట్టాడని, ఆ నిధులను ఐదేళ్ల నుంచి సక్రమంగా దళితుల అభివృద్ధికి ఉపయోగించి ఉంటే దళిత పేటల్లో మౌలిక సదుపాయాల కొరత తీరేదని చిత్రసేను అన్నారు. ఆయన వెంట బయ్యే మునీంద్ర, చల్లాబత్తుల సత్యనారాయణ, కప్పల ఇశ్రాయెల్, అంబటి పుల్లారావు, మల్లపు నాగరాజు, జివిఎస్.రావు, చిన్నం వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో గిడ్డి, హరీష్ మాధుర్ ప్రచారం

ప్రజాశక్తి - అంబాజీపేట

టిడిపి పి.గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, పార్లమెంట్ అభ్యర్థి హరీష్ మాధుర్ గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారి సమస్యలు తెలుసుకుంటూ వివరించి కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే టిడిపి లక్ష్యం కావాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలని టిడిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సుధా కాలనీలోని టిడిపి కార్యాలయంలో మండల బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారానికి కొద్ది రోజులు మాత్రమే సమయం ఉన్నందున వార్డుల వారీ ప్రచార ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ విజయానికి ప్రణాళికాబద్ధంగా పనిచేసే విధానాలను కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్పన్ రాజా సూరిబాబురాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కందుల విశ్వేశ్వరరావు, ఎలిశెట్టి నాని, మొయిళ్ల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి మందపాటి కిరణ్ దంపతుల రాజీనామా

ప్రజాశక్తి- మామిడికుదురు

టిడిపి నాయకుడు, పార్టీ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షుడు మందపాటి కిరణ్ కుమార్ దంపతులు పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం సిఎం వైఎస్.జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. 2019 నుంచి టిడిపి ఎన్నికల్లో ఓటమి తరువాత ఈ రోజు వరకూ ప్రతి పార్టీ ఏ కార్యక్రమం ఆదేశించినా తమ స్వంత ఖర్చులతో దిగ్విజయంగా పని చేశామని చెప్పారు. పార్టీ తరపున ఎనలేని సేవలు చేసిన తమకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వకుండా దళితేతర నాయకులకు నియోజకవర్గ బాధ్యతలను అప్పగించి తమ సేవలను విస్మరించారన్నారు. ఇంచార్జ్ అవకాశం ఇస్తానని ఖర్చుతో కూడుకున్న ప్రతి కార్యక్రమంలో తనతో ఖర్చు పెట్టించి పార్టీకోసం అహర్నిశలు శ్రమించిన తమ సేవలకు కనీస గుర్తింపు ఇవ్వలేదన్నారు.



సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన మందపాటి దంపతులు

వినియోగదారులకు సేవలందించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు చట్ట రీత్యా చమురు మార్కెట్ సంస్థలు కల్పించాల్సిన సదుపాయాలు సంబధిత యాజమాన్యాలు అమలు చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. బాటసారుల కోసం మంచినీటి వసతి, వినియోగదారులకు అందుబాటులో మూత్రశాలలు, మరుగు దొడ్లు, ఉచితంగా టైర్లలో గాలి నింపడం, ఆపదవేళ ఫోన్ సదుపాయం, అందు బాటులో ఫిర్యాదు పెట్టె, ఫస్ట్ ఎయిడ్ కిట్, పెట్రోల్ నాణ్యత తెలుసుకు నేందుకు పరికరాలు, ఉంచాల్సిన బాధ్యత ఉందన్నారు. స్మార్ట్ సిటీ కాకినాడ జిల్లా కేంద్రంలో 90 శాతం బంకు యాజమాన్యాలు నిబంధనలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌టిఆర్ ఆశయాలకు తూట్లు పొడిచి మతతత్వ బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పురందేశ్వరిని ఎన్‌టిఆర్ అభిమానులు ఓడించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా బిజెపికి ప్రజలు గోరీ కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రుద్రరాజు, సిపిఎం రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు, కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళితో పాటు రాజానగరం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు, అనపర్తి నియోజకవర్గ అభ్యర్థులు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు, కె.రామకృష్ణ, జువ్వల రాంబాబు, పోలిన వెంకటేశ్వరరావు, ప్రకాష్, టి.సావిత్రి, మురళి, పాల్గొన్నారు. ఆర్యాపురంలోని సత్యనారాయణ స్వామి గుడి, పుష్కరఘాట్ మీదుగా మెయిన్ రోడ్డులో ఏపి న్యాయ్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రకు ఇండియా ఫోరం కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బైక్ ర్యాలీ నిర్వహించారు.

కాకినాడలో వైఎస్ షర్మిళ భారీ రోడ్ షో

పిసిసి చీఫ్ వైఎస్ షర్మిళ ఏపి న్యాయ యాత్రలో భాగంగా కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద నుంచి రాయుడుపాలెం, ఎపిఎస్‌పి, సర్పవరం జంక్షన్, జెఎన్‌టియుకె మీదుగా భానుగుడి జంక్షన్, మెయిన్ రోడ్డు, జగన్నాథపురం వంతెన వరకు జరిగిన రోడ్డు షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు షర్మిళకు ఘనంగా స్వాగతం పలికారు.సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిపిఎం నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కె.సింహాచలం, టి.రాజా తదితరులు ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె భానుగుడి, జగన్నాథపురం జంక్షన్ వద్ద ప్రజలతో మాట్లాడారు. మన రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి ఐదేళ్ళ చంద్రబాబు ముఖ్యమంత్రిగా, మరో ఐదేళ్ళ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నారని చెప్పారు. ఈ పదేళ్లలో పట్టుమని 10 పరిశ్రమలు కూడా రాలేదన్నారు. మరి అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ ఇద్దరిలో ఎవరికి వేసినా మళ్లీ బిజెపికి ఓటు వేసినట్లే అన్నారు. బిజెపి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. పోలవరానికి నిధులు ఇవ్వలేదని, రాజధాని నిర్మాణానికి సహకరించలేదని చెప్పారు. ఈసారి ఓటు వేసేటప్పుడు మీ బిడ్డల భవిష్యత్తు కోసం ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పల్లంరాజు, కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ అభ్యర్థి చెక్క నూకరాజును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో 297 మంది

(మొదటి పేజీ తరువాయి)

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తంగా 83 మంది బరిలో నిలిచారు. వీరిలో రాజమండ్రి పార్లమెంట్‌కు 12 మంది, రాజమండ్రి అర్బన్‌లో ఒకరు ఉపసంహించుకోగా 10 మంది , రాజమండ్రి రూరల్‌లో ఏడుగురు, నిడదవోలులో ఒకరు ఉపసంహరించుకోగా 12 మంది, కొవ్వూరులో ఒకరు ఉపసంహరించుకోగా 11 మంది, గోపాలపురంలో ఒకరు ఉపసంహరించుకోగా 10 మంది, అనపర్తిలో 9 మంది, రాజానగరంలో ఇద్దరు ఉపసంహరించుకోగా బరిలో 12 మంది బరిలో నిలిచారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే, కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేస్తానని కూటమి టిడిపి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు హామీనిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 13, 8, 7 వార్డుల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు దొమ్మేటి రమణ కుమార్ ఆధ్వర్యాన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, కరపత్రాలు అందించి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ పేరుకు నగర పంచాయతీ అయినా సమస్యలకు నిలయంగా మారిందని, ఐదేళ్లలో నగరాన్ని నిర్లక్ష్యం చేశారని చెప్పారు. ప్రచారంలో సుబ్బరాజుకు మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలికారు. అనంతరం రెడ్డి అనంతలక్ష్మి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో 10 మంది టిడిపిలో చేరారు. మండలంలోని గాడిలంక, కర్రివాని రేవు, మర్లపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, అర్ధాని శ్రీనివాసరావు,



ప్రచారం చేస్తున్న దాట్ల సుబ్బరాజు

ములపర్తి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు, గుద్దటి జమ్మి, ముత్యాల జయలక్ష్మి, మిమ్మితి చిరంజీవి, లోకినీడి వెంకటేశ్వరరావు, శీలం కృష్ణమూర్తి, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, దివి మహాలక్ష్మి, అయినవిల్లి వలీ బాబా, కాశి రామచంద్రరావు, రెడ్డి సుధీర్, మెండి కమల, కుడుపూడి మల్లేశ్వరి, పెదపూడి రుక్మిణి పాల్గొన్నారు.

ఎంఎల్‌సి తోట ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, గ్రామాల్లో ఆదివారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వడ్లమూరులో మాజీ జెడ్‌పిటిసి చుండ్రు చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో గ్రామాల్లో ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టి స్వాగతం పలికారు . ఈ సందర్భంగా ఎంఎల్‌సి తోట ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రేషన్ బియ్యం, సామాజిక పెన్షన్లు ఇంటి వద్దే అందజేసిన సిఎం జగన్ మోహన్ రెడ్డి రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తోట వెంట సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ, జెడ్‌పిటిసి సభ్యుడు అబ్బు, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, విప్ పలివెల మధు, సిరివరపు శ్రీనివాస్, నక్కా సింహాచలం, రుద్ర మూర్తి, అధిక సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో ప్రజాగళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని బొబ్బర్లంక, రాజవరం, అంకంపాలెం, వెలిచేరు గ్రామాల్లో సోమవారం టిడిపి అభ్యర్థి బండారు సత్యానందరావు ప్రజాగళం ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఉదయం మొదలైన ప్రచారం రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను వివరిస్తూ తమ పార్టీకి ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. తమ అమూల్యమైన ఓటు ముద్రను వేసి మెజార్టీతో గెలిపించాలన్నారు.

ప్రచారంలో వరుపుల కుటుంబం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరంలో వైసిపి అభ్యర్థి వరుపుల సుబ్బారావు కుటుంబ సభ్యులు జోరుగా ప్రచారం నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్థానిక వైసిపి నాయకులతో కలిసి వెలంపేటలో ఉన్న 9, 10 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా, కె. అప్పారావు, డి.సతీష్, కె.బాబూరావు, ఎస్.రాము, ఎం.బాబురావు, ఆర్.రాజు, ఎస్.మధుబాబు, ఆర్. శీను, ఎ.దొర, బి.రాంబాబు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల వ్యయం నమోదు

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆసిఫ్ ఆదేశించారు. సోమవారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో కాకినాడ సిటీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణా కార్యాలయాన్ని రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ ఎన్నికల వ్యయాన్ని నమోదు చేసే విభాగాన్ని, రికార్డులను పరిశీలించి సిబ్బంది సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థులు చేసే ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు సమగ్రంగా రికార్డు చేయాలని ఆదేశించారు.

కౌంటింగ్ సెంటర్ పరిశీలన....

ఎన్నికల పరిశీలకులు ఎస్.గణేష్ సోమవారం జెఎన్‌టియుకె ఆవరణలోని సివిల్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ చేపట్టిన ఏర్పాట్లను, భద్రత చర్యలను పరిశీలించారు. ఎన్నికలకు ముందు రోజు, ఎన్నికలు జరిగే రోజున తీసుకోవలసిన చర్యలు, కల్పించాల్సిన సదుపాయాలపై సూచనలు ఇచ్చారు. ఇందుకు సంబంధించి చేసిన ఏర్పాట్లను ఆర్ఒ జె.వెంకటరావు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్.భావన, ఎఆర్ఒ చల్లన్నదొర, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ పాల్గొన్నారు.

డైరెక్ట్ ట్రాన్స్‌ఫర్, ఇంటింటికీ పించన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతి నెలా పంపిణీ చేస్తున్న సామాజిక భద్రత పించన్లను మే, జూన్ నెలలో డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్)తోపాటు, ఇంటింటికి పంపిణీ కూడా చేయడం జరుగుతుందని కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో పించన్ల పంపిణీపై అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రానున్న మే, జూన్ నెలలో సామాజిక భద్రత కొరకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లు డిబిటి విధానంతోపాటు, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 2,80,662 పింఛన్‌దారులలో 2,13,195 మందికి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 67,467 మంది దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, వివిధ ఆరోగ్య కారణాలతో మంచానికే



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

పరిమితమైన వారికి ఇంటి వద్దనే అందచేస్తామన్నారు. లబ్ధిదారులు ఎవరు పింఛన్ కోసం గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈమేరకు ఎవరికి ఏ విధంగా పింఛన్ పంపిణీ చేయాలనే అంశంపై గ్రామ, వార్డు సచివాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని వివరించారు. కాకినాడ పార్లమెంటురీ నియోజకవర్గానికి సంబంధించి 18 మంది అభ్యర్థుల నామినేషన్లు పరిశీలనలో వాలిడ్‌గా నిలిచాయని, సోమవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిందన్నారు. అదేవిధంగా జిల్లాలో పోలింగ్ ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా మే నెల 4, 5, 6 తేదీల్లో మూడు రోజుల పాటు పెసిలిటేసన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు అదేవిధంగా 7, 8 తేదీల్లో కాకినాడ జిల్లాలో పనిచేస్తూ వేరే జిల్లాలో ఓటు ఉన్నవారికి అవకాశం కల్పించడం జరుగుతుందిని వివరించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటర్లను చైతన్య పరుస్తూ ఆడియో, వీడియోల రూపంలో సందేశాలు, పాటలు రూపొందించడం జరిగిందని జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ డాక్టర్ డి.తిప్పే నాయక్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, డిపిఆర్ఒ డి.నాగార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సరస్వతి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఛైర్మన్ గంగబాబు

వివేకానంద బ్రాంచ్-2 ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని శ్రీరంగనాయకపురం గ్రామంలో శ్రీరంగ విద్యాలయ స్థానంలో చొల్లంగి వివేకానంద పబ్లిక్ స్కూల్ బ్రాంచ్ టు పాఠశాలను విద్యాసంస్థల ఛైర్మన్ కందిళ్ల గంగబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా చొల్లంగిలో ఎల్‌కెజి నుంచి 10వ తరగతి వరకు ఉన్నత ప్రమాణాలతో పాఠశాల నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ బ్రాంచ్ టు లో సిబిఎస్ఇ సిలబస్‌లో బోధన చేయనున్నట్లు వెల్లడించారు. వివేకానంద హైస్కూల్ ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ మొండి భీమశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వేగేశ్న భాస్కరరాజు, కట్ట ఆదినారాయణ, పాఠశాల హెచ్ఎం ఎం.సూర్యప్రకాష్, చొల్లంగిపేట సర్పంచ్ కందిళ్ల గంగాభవాని, ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

మదయం తరలిస్తున్న ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద చేపట్టిన తనిఖీల్లో ఒక వాహనంలో అక్రమ మద్యంతో పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మహిపాల చెరువు వద్ద చెక్ పోస్టు అధికారులు ఆదివారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఒక వాహనంలో ముగ్గురు వ్యక్తులు మూడు ఫుల్ బాటిల్స్‌ను తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్ఇబి దాడుల్లో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని భీమోలు గ్రామంలో 20 లీటర్ల నాటు సారతో ఓ మహిళను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండలంలోని కుండలేశ్వరం గోదావరిలో రూత్తాల కృష్ణ(62) గల్లంతయ్యాడు. సోమవారం కాకినాడకు చెందిన రుత్తాల కృష్ణ, జానకి దంపతులు కాట్రేనికోన మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం కుండలేశ్వరంకు వచ్చారు. భార్య జానకి పుష్కరాల రేవులో మొదట స్నానానికి దిగింది. ఆమె స్నానం చేసిన తరువాత భర్త కృష్ణ గోదావరిలో స్నానానికి గల్లంతవడంతో జానకి పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది స్థానిక గజ ఈతగాళ్లతో మర పడవల సహాయంతో తీవ్రంగా గాలింపుచర్యలు చేపట్టారు. గల్లంతైన కృష్ణ కాకినాడ రమణయ్య పేటలో ఆటోమొబైల్ షాపును నిర్వహిస్తున్నట్లు సమాచారం. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉండగా వారు అమెరికా, కెనడాలలో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటన ఉదయం జరుగగా సాయంత్రం వరకూ గాలించినా గల్లంతైన కృష్ణ ఆచూకీ లభ్యం కాలేదు.

పాలక పార్టీలను ప్రశ్నించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజలంతా ప్రతిపక్షమై పాలక పార్టీలను ప్రశ్నించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, ప్రజా సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి), ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (విజృంభన) తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న ప్రజా చైతన్య యాత్ర రథం సోమవారం జగ్గంపేట చేరుకుంది. స్థానిక ట్రావెల్స్ బంగ్లా నుంచి బస్టాండ్ మీదగా పంచాయతీ కార్యాలయం వరకు మార్కెట్లో అరుణోదయ కళాకారులు తమ ఆట, పాటలతో ప్రజలను చైతన్య పరుస్తూ, కరపత్రాలు పంచుతూ విస్తృతస్థాయి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ. కేంద్రంలోని నరేంద్ర మోడీ కార్పొరేట్, కార్పొరేట్, అంటూ కార్పొరేట్ల జపం చేస్తున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టి మోడీ వద్ద మోకరిల్లుతున్నాయని అన్నారు.

వైసిపి విజయమే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రామారావుపేటలోని వైసిపి కార్యాలయంలో మండల, పట్టణ బూత్ కమిటీల సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, గంగిరెడ్డి కృష్ణమూర్తి, ఊబా జాన్ మోసెస్, మోరంపూడి రంగా, ఆవాల లక్ష్మీనారాయణ, మన్యం చంద్రరావు పాల్గొన్నారు.

విభజన హామీలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం



ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి సత్యనారాయణ

రాష్ట్ర విభజన హామీలు అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి నీరుకొండ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలం లోని ఎర్రవరం గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కు పోయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొయ్యేటి సూర్యప్రకాశరావు, కొప్పన కోటేశ్వరరావు, కరణం శ్రీనివాస్, మొయ్యేటి నారాయణ, తాతపూడి జార్జి రాజు కార్యకర్తలు ఉన్నారు.

పెద్దాడలో ఎంఎల్ఎ ప్రచారం

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో పెద్దాడ గ్రామంలో వైసిపి అనపర్తి నియోజకవర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో అమలు చేసిన పథకాలను దృష్టిలో పెట్టుకుని వైసిపికి అండగా నిలవాలని కోరారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే వైసిపి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అద్దంకి ముక్తేశ్వరరావు, కోసూరి వాసు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద రోగి బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఒక రోగి బంధువులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే తమ కుటుంబ సభ్యురాలు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలం కొమరగిరి గ్రామానికి చెందిన సిహెచ్ పద్మజా మార్చి 12వ తేదీన డెలివరీ కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ అయ్యింది. డెలివరీ అనంతరం ఏప్రిల్ 5న ట్యూబెక్టమీ ఆపరేషన్‌ను ఇదే ఆసుపత్రిలో చేశారు. ఏడు రోజుల తర్వాత ఆసుపత్రికి కుట్లు ఇప్పించుకుందామని వచ్చింది. ఆ సమయంలో చీము కారడంతో శుభ్రం చేసి చికిత్స చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆసుపత్రికి వచ్చి వైద్యురాలు సుజాతను సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆందోళనకు దిగారు. ఈ సంఘటనపై వైద్యురాలు సుజాత మాట్లాడుతూ కుట్లు తీసే సమయంలో చీము కారడంతో వైద్య సేవలందించి ఆసుపత్రిలో ఉండమని సూచించామని, అయితే వారు వెళ్లిపోయి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇప్పుడు మాపై నిందలు వేయడం సరికాదన్నారు. బాధితురాలి భర్త ఇదే ఆసుపత్రిలో జిడిఎగా పని చేస్తున్నారన్నారు. ఆసుపత్రులో జాయిన్ చేయిస్తే వైద్యం అందిస్తామని, అవసరమైతే మెరుగైన వైద్య సేవల కోసం కాకినాడకు తరలిస్తామని అన్నారు.

క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మెడికోవర్ హాస్పటల్లో అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేపట్టినట్లు మెడికోవర్ హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్ కె.సిద్ధరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక అచ్చంపేట మెడికోవర్ హాస్పిటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోనసీమ జిల్లాకి చెందిన 81 సంవత్సరాల వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయారని తెలిపారు. ఈ క్రమంలో ఆయన ఎడమ తుంటికి తీవ్ర గాయం అయ్యిందన్నారు. గుండెకు సంబందించిన సమస్యలతోపాటు, బిపి, కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నాయని వివరించారు. ఇలాంటి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు మెడికవర్ హాస్పిటల్స్‌లో అత్యంత సులువుగా డాక్టర్ మాత శ్రీనివాస్, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ కిషోర్‌బాబు ఇతర వైద్య బందం ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతం చేసిన వైద్య బృందానికి ఆయన అభినందనలు తెలిపారు.

అమరవిల్లిలో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని అమరవిల్లిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ ప్రచారంలో సురక్ష హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ పాల్గొని ఇంటింటికి వెళ్లి పవన్ కళ్యాణ్ ను గెలిపించాలని కోరారు. పిఠాపురం నియోజకవర్గం అభివీద్ధి పదంలో నడవాలంటే కూటమి అభ్యర్థి పవన్‌ను గెలిపించాలని కోరారు

హోప్ ఐలాండ్‌లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి పంచాయతీలో భాగమైన హోప్ ఐలాండ్ ప్రాంతంలో వైసిపి ముమ్మిడివరం నియోజక వర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ పర్యటనలో ఆయన ఇంటింటికి వెళ్లి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, నాయకులు కొపనాతి నాగరాజు, కోరంగి ఉప సర్పంచ్ భైరవమూర్తి, తదితరులు పాల్గొన్నారు. అలాగే గాడిమొగ పంచాయితీలోని పెద వలసల, లక్ష్మీపతి పురం గ్రామాల్లో పొన్నాడ సతీమణి పొన్నాడ నీరజ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ పర్యటనలో ఎంపిటిసిలు రేఖాడి నరసింహామూర్తి, చెక్క కామేశ్వరరావు పాల్గొన్నారు.

లోకేష్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రతిపాడు నియోజకవర్గంలో దివంగత వరుపుల రాజా జ్ఞాపకార్థం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను టిఎన్‌ఎస్‌ఎఫ్ ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షులు గవిరెడ్డి గురునాథ్ సోమవారం మంగళగిరిలో కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతను ఆదుకోవాలని కోరారు.

సతీష్‌ను అభినందించిన సత్యప్రభ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల ఉభయగోదావరి జిల్లాల ఎన్నికల కోఆర్డినేటర్‌గా నియమితులైన పారిశ్రామికవేత్త సాన సతీష్‌ను ప్రతిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ అభినందించారు. ఈ సందర్భంగా వారిరువురూ ఉభయగోదావరి జిల్లాల్లో కూటమి అభ్యర్థుల విజయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్తిపాడు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి సత్య ప్రభ విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వావిలాలకు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్యకు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద మాట్లాడుతూ గ్రామాల్లో యువతను సమీకరించి గ్రంథాలయాలు నెలకొల్పడానికి ఆయన విశేషంగా కృషి చేశారన్నారు. తెలుగులో 45, ఆంగ్లంలో 16 పుస్తకాలు ఆయన రచించారని గుర్తు చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మజ్జిగ వితరణ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరంకు చెందిన హోటల్ యజమాని పిచ్చేటి కృష్ణ వివాహ దినోత్సవాన్ని పురష్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మజ్జిగని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లిరోజు, పుట్టినరోజు ఇతర శుభదినాల్లో పార్టీలు, పబ్బాలు అంటూ విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేసే బదులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతో మానసిక ఆనందం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు పలివెల శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన ప్రచారం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని చాకిరేవుపాలెం, జల్దాం, డి పైడిపాల గ్రామాల్లో కూటమి బలపర్చిన అభ్యర్థుల విజయం కోసం జనసేన ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ఆయా గ్రామాల్లో మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కరణం సుబ్రహ్మణ్యం. సతీష్, గంగాధర్, నాగు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచుల్లో ఉపాధి కూలీలు

నిలువ నీడ లేకుండానే పనులు



మండుటెండలో జాతీయ రహదారి 216 డివైడర్ పై వేచి ఉన్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రోజు లేచింది మొదలు రోడ్డుపై ఏ ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో తెలియదు. అటువంటి ఈ రోజుల్లో కాయకష్టం చేసే కూలికి భద్రత లేకుండా పోయింది. ఉపాధి కూలీలకు పని ప్రారంభంలో ఒక ఫోటో తీస్తున్నారు. పని పూర్తయిన తర్వాత రెండో ఫోటో తీస్తున్నారు. ఉపాధి పని ముగిసిపోయిన రెండో ఫోటో కోసం ఉపాధి కూలీలు వేచి ఉండాల్సి వస్తుంది. ఆ సమయంలో ఎటువంటి నీడ సౌకర్యాలు లేక ఉపాధి కూలీలు రోడ్డుపైనే మండుటెండల్లో జీవనం సాగిస్తున్నారు.

మండలంలోని లచ్చిపాలెం పంచాయతీలో నడిరోడ్డుపై ఉపాధి కూలీలు వేచి ఉన్న సంఘటన చోటుచేసుకుంది. జాతీయ రహదారి 216పై ఉన్న డివైడర్‌పై మండుటెండలో కూర్చుని ఉపాధి కూలీలు వేచి ఉండడాన్ని 'ప్రజాశక్తి' క్లిక్ మనిపించింది. డివైడర్‌పై కూర్చున్న కూలీల మీదకి ప్రమాదవశాత్తు ఏదైనా వాహనం అదుపు తప్పితే ఎంత ప్రమాదం ముంచుకొచ్చే అవకాశాలు లేకపోలేదు. నిలువ నీడ లేక ప్రమాదపు అంచుల్లో ఉపాధి కూలీలు జీవనయానం సాగిస్తున్నారు. దీనిపై ఉపాధి కూలీలను ప్రశ్నించగా పని వద్ద టెంట్లు ఏర్పాటు చేయలేదని, నీడ లేక రోడ్డుపైన కూర్చున్నామని తెలిపారు. లచ్చిపాలెం పరిధిలోని ఊట కాలువ పూడికతీత పనిలో భాగంగా సుమారు 42 మంది సోమవారం పనికి హాజరు కాగా, మిగిలిన కొందరు రోడ్డు చెంతనే నిలబడి ఉండడం గమనార్హం. సంబంధిత అధికారులు కూలీలకు ఎటువంటి ఏర్పాట్లు చేయకుండా ఉపాధి పని కల్పించడం శోచనీయం. ఉపాధి కూలీల దయనీయతకు ఇది నిదర్శనం.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఉప్పాడలో తనిఖీలు ముమ్మరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ రింగ్ రోడ్‌లో బీచ్ రోడ్డులో వెళ్లే వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం తనిఖీలు నిర్వహించే పాయింట్‌ను పోలీస్ జనరల్ పరిశీలకులు పాటిల్ సందర్శించారు. ఇప్పటి వరకు ఎన్ని వాహనాలు తనిఖీలు చేశారనే దానిపై సంబంధిత రికార్డులను ఆయన పరిశీలించారు. తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు రేషన్ కార్డుకి రూ.1500 ఇచ్చారనే విషయం బయటకు రావడంతో దానిపై విచారణ చేసి నివేదికను ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు ఎన్నికల దృష్ట్యా పటిష్టంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

దర్శకులు ఆనంద్‌కు రంగస్థల పురస్కారం



ఆనంద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రముఖ దర్శకులు, రచయిత, రంగస్థల నటులు సామర్లకోటకు చెందిన కోరుకొండ బ్రహ్మానందం (ఆనంద్) నవయుగవైతాలికులు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా తెలుగు నాటక రంగస్థల పురస్కారం అందుకున్నారు. కాకినాడలోని సీతారామరాజు స్మారక కళా వేదికలో జరిగిన 40వ వార్షికోత్సవ వేడుకల్లో ఉత్తమ కళాకారులకు అవార్డు ప్రధానోత్స కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కు కిరణ్ నేత్ర వైద్యాశాల అధినేత డాక్టర్ శంకురాత్రి చంద్రశేఖర్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారన్ని అందజేశారు. ఈ సందర్భంగా సకల కళా సమాఖ్య నాయకులు బడుగు సీతారామరాజు, కేతినీడి శ్రీనివాస్, కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి, అలమండ ప్రసాద్, సేపేని సురేష్, పెద్దాపురం, సామర్లకోట ఆర్కెస్ట్రా ఆర్టిస్ట్ అసోసియేషన్ నాయకులు గిడుతూరి శ్రీనివాసరావు, బొడ్డు రామారావు, మధు, ప్రసాద్, శివఅభినందనలు తెలిపారు.

ముగిసిన సైన్స్ సమ్మర్ క్యాంప్



అవగాహన కల్పిస్తున్న శ్రీకృష్ణ సాయి

ప్రజాశక్తి - పెద్దాపురం


స్థానిక రామారావుపేటలోని యాక్ట్ సైన్స్ సెంటర్లో ఐదు రోజులపాటు నిర్వహించిన సైన్స్ సమ్మర్ క్యాంపు సోమవారం సాయంత్రం ముగిసింది. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో స్థానిక మహారాణి కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు గంగాధరుడు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు ద్వారా విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన అనేక అంశాలను ప్రయోగాల ద్వారా సులభంగా నేర్చుకోగలిగారన్నారు. 5వ రోజు శిబిరంలో రామచంద్రపురం రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణసాయి ఘర్షణ, కాంతి, అయస్కాంతం, విద్యుత్తు, విద్యుత్తు అయస్కాంతం, ధ్వని, ఉష్ణం తదితర భౌతిక శాస్త్ర ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు రసాయన శాస్త్ర ప్రయోగాలపై బుద్దా శ్రీనివాస్, 2వ రోజు జీవశాస్త్ర ప్రయోగాలపై బత్తుల కృష్ణ, 3వ రోజు సైన్స్ మ్యూజిక్, 4వ రోజు సరదా గణితంపై చంద్రయ్య, 5వ రోజు భౌతిక శాస్త్ర ప్రయోగాలపై కృష్ణసాయి శిక్షణ ఇచ్చారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ 6 నుండి 10 వ తరగతి వరకు చదివే 70 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొన్నారన్నారు. ఈ సభలో రాజీవ్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం రమాదేవి, రామచంద్రపురం ఈశ్వరరావు, రొంగల అరుణ్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కళలకు ప్రోత్సాహం అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సాంప్రదాయ నృత్య కళలను భావితరాలకు అందించేందుకు ప్రోత్సాహం అవసరమని ప్రముఖ నృత్య కళాకారిణి భాగవతుల జగత్ జ్యోతి అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ నృత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదిమానవుని దగ్గర నుంచి నేటి సమాజం వరకు నాట్యం వివిధ రూపాల్లో మానవాళి వికాసానికి తోడ్పడుతుందన్నారు. ఈ కళలను ప్రోత్సహించాలనే భావంతో ఈషా ఫైన్ ఆర్ట్స్ సంస్థ ద్వారా గత 25 ఏళ్లగా తాను నృత్య గురువుగా నృత్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ట్రస్ట్ ఛైర్మన్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో జగత్ జ్యోతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, గణేష్, డాక్టర్ కె.వెంకటరమణ, కుమార్ యాదవ్, ఎస్.శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, పూర్ణ, రాఘవరావు పాల్గొన్నారు.

పనసపాడులో వైసిపి ప్రచారం



మిషన్‌ను తొక్కుతున్న దొరబాబు సతీమణి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పనసపాడు గ్రామంలో వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబును గెలిపించాలని ఆయన భార్య చంద్రకళ, కుమార్తె సార్విక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

పది టాపర్‌ను అభినందించిన పవన్



పవన్‌తో గీతశ్రీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 573 మార్కులు సాధించిన గీతశ్రీని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి దండ్రులు ఆడపిల్ల, మగ పిల్లవాడు అనే భేదం లేకుండా ఉన్నత చదువులు చదివించాలని సూచిం చారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఉపాధి అవకా శాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. చదువు ముగించుకున్న విద్యార్థులకు వారి అభిరుచికి అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



అవగాహన ర్యాలీలో ఎంపిడిఒ ఉషారాణి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు గ్రామంలో సోమవారం మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసిసి)కన్వీనర్, ఎంపిడిఒ జి.ఉషారాణి ఆధ్వర్యంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. పంచాయితీ, సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ యంత్రాల పనితీరు, ఓటు వేసే విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.రాధాకృష్ణ, మహిళా పోలీసు పరంజ్యోతి, వెల్ఫేర్ సెక్రెటరీ సులోచన రాణి, విఆర్‌ఒలు సన్నపు వరప్రసాద్, నవజీయా సుల్తానీ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపడిఒ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ పి.నారాయణ ఆదేశించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో వేసవికి సరిపడా నీటిని నిల్వ ఉంచడం జరిగిందని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సంధ్య ఆయన దృష్టికి తెచ్చారు. వేసవికాలంలో తాగునీటిని వృధా చేయకుండా వినియోగించుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గౌరుపల్లి గ్రామంలో పోలింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-చాగల్లు

గౌరిపల్లి పంచాయితీలో సోమవారం ఎంపిడిఒ నాతి బుజ్జి ఓటర్లను చైతన్యవంతం చేయడం ద్వారా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఓటూ విలువైనదేనని, మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క ఓటరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణరీత్యా వడగాల్పులు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. ఉపాధి హామీ పనుల వేతనదారులకు వడదెబ్బకు గురవకుండా ఎఎన్ఎంతో ఒఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఇసి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మండపేటలో టిడిపిలో చేరిన నాయకులు

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-కొత్తపేట, మండపేట

కొత్తపేట మండలం వానపల్లి గ్రామ శివారు బొడ్డుమల్లిపాడులో సోమవారం పలువురు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి టిడిపి కొత్తపేట అభ్యర్థి బండారు సత్యానందరావు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండపేటలోని 6వ వార్డులో వైసిపికి చెందిన పలువురు నాయకులు సోమవారం బి.శేఖర్, ఎం.ప్రసాద్, వి.బుల్లిరాజు, పి.జయరాజు, పి.రవితేజ, పి.సతీష్ ఆధ్వర్యాన టిడిపిలో చేశారు. టిడిపి పట్టణ కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చుండ్రు శ్రీవర ప్రకాష్ సమక్షంలో వీరు పార్టీలో చేరారు. వీరందరికీ వేగుళ్ల అజయ్, వి.సాయికుమార్ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, గడి రాంబాబు, బత్తుల గణపతి పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపిడిఒ

పింఛన్ల పంపిణీపై ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి-కడియం

మే 1వన ఇవ్వాల్సిన పింఛన్లు పంపిణీకి సంబంధించి ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నిబంధనల ప్రకారం అధిక శాతం మంది పింఛనుదారులకు వారి బ్యాంకు ఖాతాలకే సొమ్ములు జమవుతాయన్నారు. మిగిలిన వారికి పింఛను పంపిణీ ఇంటింటికీ వెళ్లి ఏ విధంగా అందజేయాలి అనేదానిపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్ష జరిపారు. పింఛనుదారులు ఎవరూ సచివాలయ కార్యాలయం వద్దకు రానీయకుండా ముందుగానే వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఆయా సచివాలయాలకు పంపిణీ చేయవలసిన పింఛను సొమ్ము ముందు రోజే బ్యాంకు నుంచి డ్రా చేసి ఒకటవ తేదీన ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలన్నారు.

పెన్షన్ల పంపిణీలో క్షేత్ర స్థాయి ఉద్యోగులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల కమిషన్ నిర్ధేశించిన నియమావళిని అనుసరించి ప్రత్యేక కేటగిరీ లబ్ధిదారులకు ఇంటి వద్దనే సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారులతో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందుకోసం క్షేత్ర స్థాయిలో కార్యచరణ రూపొందించాలని, అందుకు అనుగుణంగా సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖల ఉద్యోగులు సేవలు ఉపయోగించు కోవాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించాల్సి ఉందన్నారు. సుమారు 74 శాతం మందికి డిబిటి ద్వారా బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేయనున్న దృష్ట్యా మిగిలిన వారి వివరాలు గ్రామాల వారీగా అందజేయనున్నట్టు తెలిపారు. ఆ మేరకు ఉద్యోగుల సేవలు ఉపయోగించుకుని, ఒకటో తేదీన సజావుగా చెల్లింపులు జరపాలని కోరారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ ఉపసంహరణ గడువు ఉందని, అనంతరం 'ఫారం 7 ఎ' అభ్యర్థుల క్రమాన్ని అనుసరించి సమర్పించాలని కలెక్టర్ మాధవీలత తెలియ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, తదుపరి గుర్తింపు పొందిన అన్ రిజిస్టర్ రాజకీయ పార్టీలు, గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల వారీగా మూడు కేటగిరీలుగా బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, హోమ్ ఓటింగ్, అత్యవసర సేవలు అందించే శాఖల, విభాగాల పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వర్తించడం కోసం సమయ పాలన, తేదీలను అనుసరించి రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.నరసింహులు, ఎలక్షన్ డిటి ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ఎంపీకి 91 మంది, అసెంబ్లీకి 15 మంది

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం పార్లమెంట్ స్థానానికి 15 మంది అభ్యర్థులు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 91 మంది అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో అభ్యర్థులకు గుర్తులు కేటాయించామన్నారు. రెండో దశ పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ పరిశీలకులు రాజకీయ, నాయకుల సమక్షంలో ఎన్ఐసి అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులను వారు పని చేసే నియోజకవర్గాలకే ఎంపిక చేస్తామన్నారు. ఒకే కార్యాలయంలో పని చేసే ఇద్దరు ఉద్యోగులకు ఒకే పోలింగ్ కేంద్రం కేటాయించరన్నారు. ఎన్నికల సంఘం అంగన్‌వాడీలను కూడా ఇతర పోలింగ్ పర్సన్‌గా నియమించు కునే అవకాశాన్ని ప్రస్తుతం కల్పించిందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సూక్ష్మ పరిశీలకులుగా బ్యాంకర్లు ఎల్ఐసి, ఒఎన్‌జిసి, పోస్టల్ విభాగాల్లో పని చేసే ఉద్యోగులను నియమించినట్లు తెలిపారు. వీరికి ఈనెల 30 వచ్చే నెల ఒకటో తేదీలలో పరిశీలకుల సమక్షంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. మే 5, 6 తేదీల్లో ఏడు అసెంబ్లీలకు సంబంధించి ఆర్ఒ స్థాయిలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తా మన్నారు. పక్క జిల్లాలలో ఓటు హక్కు ఉన్న వారు స్థానికంగా ఓటు హక్కును ఆర్ఒ స్థాయిలో వినియోగించుకు నేందుకు అవకాశం కల్పించామన్నారు. ఇంటి నుంచే ఓటింగ్ కోసం 1,100 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్లు టి.వైద్యనాథ్ శర్మ, పి.సుబ్రహ్మణ్యం, సుబ్బరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



మెడల్స్ స్వీకరిస్తున్న విజేతలతో అబ్బులు

తైక్వాండోలో కలవచర్ల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

ఉమ్మడి జిల్లా స్థాయి టైక్వాండో పోటీల్లో మండలంలోని కలవచర్ల టైక్వాండో స్కూలుకు చెందిన విద్యార్థులు ఉత్మ ప్రతిభను కనబరిచినట్లు ఆ సంస్థ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు తెలిపారు. సబ్ జూనియర్ బోయ్స్ 30 కేజీల విభాగంలో పాలెపు మోక్ష వెంకట్, 35 కేజీల విభాగంలో వడ్డి కార్తికేయ, బాలికల 20 కేజీల విభాగంలో పాలెపు లాస్య, సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. జూనియర్స్ బాయ్స్ 40 కేజీల విభాగంలో గెద్దాడ జాయ్ కిరణ్ కాంస్య పతకం సాధించగా, క్యాడ్ గర్ల్స్ విభాగంలో వడ్డి గిరిజ, జూనియర్స్ విభాగంలో మెరిపే సత్యకాంత్, గోల్డ్ మెడల్స్‌తో మెరిశారు. విజేతలను సీనియర్ మాస్టర్స్ వెంకటలక్ష్మి, కోచ్‌లు టి.కిరణ్, ఎం.సత్యకాంత్ తదితరులు అభినందించారు.



నివాళులర్పిస్తున్న మంత్రి వేణుగోపాల కృష్ణ

సాపిరెడ్డి కుటుంబానికి మంత్రి వేణు పరామర్శ

ప్రజాశక్తి-కడియం

మాతృ వియోగంతో బాధ పడుతున్న కడియపు సావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు కుటుంబాన్ని మంత్రి, వైసిపి రూరల్ అభ్యర్థి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ సోమవారం పరామర్శించారు. తొలుత సాపిరెడ్డి చంద్రావతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సూరిబాబు సోదరులు నాగేశ్వరరావు, త్రిమూర్తులు, ఆదిని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట కొత్తపల్లి శివాజీ, ముత్యం జగదీష్, ఈలి సత్తిబాబు, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఎంపిటిసి సాపిరెడ్డి వీర దుర్గా కామేష్ పాల్గొన్నారు.

సీ విజిల్ యాప్ ఫిర్యాదులపై చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల గురించి సిపిఒ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. యాప్ ద్వారా పౌరుల నుంచి నియమావళి ఉల్లంఘనలపై ఈ నెల 28న 12 ఫిర్యాదులు అందగా 11 ఫిర్యాదులను వంద నిమిషాల్లోపు పరిష్కరించామని, ఒక ఫిర్యాదు ఉల్లంఘన కాదని గుర్తించామని తెలిపారు. గత నెల 16 నుంచి ఈ నెల 28 వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 549 ఫిర్యాదులు రాగా వాటిలో 103 ఫిర్యాదులు నియమావళికి సంబంధించినవి కావని గుర్తించామని, మిగిలిన 446 ఫిర్యాదుల్లో 100 నిమిషాల్లోపు 408 ఫిర్యాదులను పరిష్కరించామని, 38 ఫిర్యాదులను వంద నిమిషాలు పైబడిన తర్వాత పరిష్కరించామని తెలిపారు. గత నెల 16వ తేదీ నుండి ఈ నెల 28 వరకు 40 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వెలగపూడిలోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నుంచి అందాయని వీటిలో 33 ఫిర్యాదులను పరిష్కరించామని, 7 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు.

పిల్లి సూర్యప్రకాశ్‌కు పలువురి మద్దతు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మున్సిపల్ కౌన్సిలర్ కోటిపల్లి లక్ష్మీ శివాజీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రజకులు ఆత్మీయ సమావేశంలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సూర్య ప్రకాష్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎసిబి డిఎస్‌పికి ఎంఇఒ అభినందన

ప్రజాశక్తి-ఆలమూరు

ఇటీవల రాజమహేంద్రవరం ఎసిబి డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన దంతులూరి శ్రీహరిరాజున ఆలమూరు ఎంఇఒ పివి.సుబ్బరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మంచి ప్రణాళికలు రూపొందించుకుని ఆచరించాలని ఎసిబి డిఎస్‌పి సూచించినట్లు తెలిపారు.



వలస ఓటర్లను ఆహ్వానిస్తున్న జనసేన నేతలు

వలస ఓటర్లకు జనసేన ఆహ్వానం

ప్రజాశక్తి -మామిడికుదురు

జీవనోపాధి కోసం, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పి.గన్నవరం నియోజకవర్గ ఓటర్లు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుని జనసేనకు ఓటు వేయాలని పలువురు ఆ పార్టీ నాయకులు హైదరాబాద్ వెళ్లి సోమవారం వారిని కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మామిడికుదురు మండల అధ్యక్షుడు జె.శ్రీనివాస్ రాజా, ఎంపిటిసి కొమ్ముల జంగమయ్య, చెరుకూరి సత్తిబాబు, బళ్ల సతీష్, కొమ్ముల భద్రం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ద్వారపూడి పరిధిలోని 11 కెవి కామన్ ఇండస్ట్రియల్ ఫీడర్, అర్తమూరు ఎసిఎల్ ఫీడర్‌లో రీ కటింగ్ తదితర మరమత్తుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 06-00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తాపేశ్వరం మండపేట రోడ్డు, ద్వారపూడి అయ్యప్ప స్వామి టెంపుల్ రోడ్డు కేశవరం రోడ్డు గ్రామం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎలక్ట్రికల్ ఇఇ వై.విజయనం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



రుద్రరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగుకు ఎల్ఐసి వినతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజును ఎల్ఐసి ఉద్యోగుల సంఘం సభ్యులు సోమవారం కలిశారు. జీవిత బీమా పాలసీలు, ఆరోగ్య బీమా పాలసీలపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జిఎస్‌టి తగ్గించాలని, జీవిత బీమా రంగం పూర్తి స్థాయిలో ప్రభుత్వ రంగంలో కొనసాగడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని, జీవిత బీమా పాలసీల ప్రీమియంపై ప్రత్యేక ఆదాయ పన్ను రాయితీలు కల్పించాలని కోరారు. యూనివర్సల్ పెన్షన్ పథకం ద్వారా అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు జి.రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్, నాయకులు, మాథ్యూస్, శ్రీనివాస్, సాయిబాబా, గన్నెయ్య, విశ్వనాథ్, భరణి, బి.శ్రీనివాసరావు, పిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.



పోలింగ్ స్టేషన్ చెక్‌పోస్ట్ పరిశీలిస్తున్న చంద్రకాంత్

పోలింగ్ స్టేషన్ల చెక్‌పోస్టుల పరిశీలన

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ ఎలక్షన్ అబ్జర్వర్ ఎవి.చంద్రకాంత్ సోమవారం సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల చెక్‌పోస్టులను పరిశీలించారు. కె.గంగవరం మండలంలోని బాలాంత్రం, రామచంద్రపురం మండలంలో నరసరావుపేట చెక్‌పోస్టులను పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు చేశారు. నరసాపురపు పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఎలక్షన్ రోజు అక్కడ ఏ విధమైన సంఘటనలూ జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్, సిఐ దొర రాజు, ఎస్ఐ సురేష్ బాబు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

విద్యా కానుక స్టాక్ పరిశీలన

ప్రజాశక్తి-కడియం

కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు సందర్శించారు. ఈ వేసవి సెలవుల్లో విద్యా కానుక కిట్లు మండల స్టాక్ పాయింట్లకు వస్తాయని, వాటిని తీసుకుని భద్రపరచాలని చెప్పారు. ప్రతి ఐటమ్‌కు ఒక తరగతి గదిని కేటాయించాలని, ఏ సమయంలో వచ్చినా కిట్లు తీసుకోవడానికి సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో వచ్చిన సందేహాలను నివృత్తి చేయాలని, జరగబోయే సప్లమెంటరీ పరీక్షలలో విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయుల కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు కూడా సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని అందరూ ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఆయన వెంట ఎంఇఒ వై.నాగేశ్వరరావు, ఎంఎం గౌరీ శంకర్, సిఎంఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు వ్యవస్థ విధులను నిర్వర్తించాలని, జిల్లా ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకోవాలని ఎన్నికల రాష్ట్ర పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్రా పిలుపు నిచ్చారు. సోమవారం జిల్లా పర్యటన సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత, ఎస్‌పి జగదీష్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ మిశ్రా మాట్లాడుతూ, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఓటు హక్కు ద్వారా మనల్ని పరిపాలించే పాలకులను ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. ఆ క్రమంలో పోలీసులు, భద్రత సిబ్బంది నిర్వహించే ఉద్యోగ నిర్వహణ సామర్థ్యం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. దేశం కోసం మనం చేసే విద్యుక్త ధర్మంలో ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే విధి నిర్వహణ ఎంతో కీలకం అన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు కులం, మతం, ప్రాంతం, తరతమ బేధం లేకుండా ప్రవర్తించాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటరు నిర్భితితో ఓటు హక్కును వేసేలా అందరం సమన్వయంతో పని చేయాలని కోరారు. ఓటర్ల స్లిప్స్ పంపిణీ కోసం, హోమ్ ఓటింగ్‌పై తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు. పోలింగ్ కేంద్రంలో ఫోటోలు తీసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం, ఈ క్రమంలో అవగాహన కల్పించడం ముఖ్యం అన్నారు. ఫేక్ న్యూస్, టీవీలలో స్క్రోలింగ్, సామాజిక మాధ్యమాల్లో ప్రచార విషయంలో తక్షణం స్పందించి, ఖండించాలని తెలిపారు. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల ఖరారు అనంతరం ఓటర్ స్లిప్స్ పంపిణీ, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ ప్రక్రియకు చెందిన సమాచారం అందచేసి, తగిన రశీదు తీసుకుంటారని కలెక్టర్ కె.మాధవీలత వివరించారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద విడియో రికార్డింగ్, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం 16 బృందాలు, 375 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, పర్యవేక్షణ కోసం 233 బందాలు, 15 చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సీజర్స్ ప్రక్రియలో రూ.15.50 కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్‌పి పి.జగదీష్ మాట్లాడుతూ, జిల్లాలో 175 పోలింగ్ కేంద్రాల లోకేషన్స్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 405 ఉన్నట్లు తెలిపారు. 88 నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు తెలిపారు. మార్గదర్శకాల ఉల్లంఘనపై 28 కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డిజిపి శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు అరవింద్, వ్యయ పరిశీలకులు రోహిత్ నాగర్, జై అరవింద్, నితిన్ కురియన్, ఎఎస్‌పి అనిల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు దీపక్ మిశ్రా

ఉప్పలగుప్తంలో కాంగ్రెస్ అభ్యర్థి సుభాషిణి ప్రచారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పంచాయితీ పేరాయి చెరువు ఏటిమెరక, లక్ష్మీపురం, బదుగుపేట, మధురపేట గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయితాబత్తుల సుభాషిణి ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సుస్థిరమైన సంక్షేమ పాలన కావాలంటే తనను అమలాపురం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జంగా గౌతమ్‌ను హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ ఎన్‌డిఎ కూటమి రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. అధికార వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీకి తొత్తులుగా మారాయన్నారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. దళితుల అభివృద్ధి లేదని జగన్ గెలుపునకు దళితుల ఓట్లు మాత్రం కావాలన్నారు. దళితుల 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందని బిసి మైనార్టీలకు పదవులు ఇచ్చారే కానీ వారికి ఇప్పటికీ ఒక కార్యాలయం కానీ కుర్చీ కూడా లేదన్నారు. జగన్ రూ.8 లక్షల కోట్లు అప్పు చేసి పప్పుకూడు తినిపించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి కో ఆప్షన్ సభ్యులు చీకట్ల అబ్బాయి, ఎపిసిసి సభ్యురాలు దోనిపాటి విజయలక్ష్మి, మాజీ ఎంపిపి జోగి అర్జునరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల నాగేంద్ర ప్రసాద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మెహబూబా షకీలా, అయితాబత్తుల కుమార్ సింగ్, రెడ్డి బాబు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సుభాషిణి

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత పోలింగే లక్ష్యంగా శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలని కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల ఉమ్మడి ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా, ఎస్‌పి ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల వేళ శాంతిభద్రతల పరిరక్షణకు అక్రమ రవాణా నిరోధానికి చేపట్టిన చర్యలను స్థానిక ఎస్‌పి వివరించారు. అనంతరం దీపక్ మిశ్రా మాట్లాడుతూ అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపి, ఓటర్లు నిర్భయంగా ఓటు వేసే పరిస్థితులు కల్పించాలన్నారు. ఎన్నికల్లో అన్ని రకాల ప్రలోభాలకు అడ్డుకట్ట వేయాలన్నారు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపైయ దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాల పహారా ఏర్పాటు చేయాలన్నారు ఓటు హక్కును ప్రశాంతంగా వినియో గించుకోవచ్చన్న విశ్వాసాన్ని ఓటర్లలో కల్పించేందుకు జిల్లా అంతటా సివిల్, ఎఆర్, సాయుధ బలగాలతో కవాతు నిర్వహించాలన్నారు. సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలో రౌడీషీటర్లను గుర్తించి కౌన్సెలింగ్ చేయాలన్నారు. ఎన్నికల్లో ఆటంకం కలిగిస్తారని అనుమానం ఉన్నవారిని గుర్తించి నాన్ బెయిలబుల్ వారెంట్ నోటీసులు జారీ చేయాలన్నారు. తీవ్ర నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వారిపై నిఘాకై షాడో పార్టీలను ఏర్పాటు చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల్లో అక్రమాలను అడ్డుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేయాలన్నారు. జిల్లా సరిహద్దులోని సిసి కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు ప్రత్యేక ఎన్నికల సెల్ ఏర్పాటు చేసి వాటన్నింటిని పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ఇతర ప్రలోభాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. తెలుగు సాధారణ ఎన్నికలు 2024 సంబంధించి పర్యవేక్షణ కోసం దీపక్ మిశ్రా, శాంతిభద్రతల అదనపు డిజి శంఖబ్రతబాగ్చి, ఐజి అశోక్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు.



దీపక్ మిశ్రాతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి



ప్రచారంలో పాల్గొన్న వంగవీటి రాధాకృష్ణ

కూటమికి మద్దతుగా వంగవీటి రాధా ప్రచారం

ప్రజాశక్తి -దేవరపల్లి

సోమవారం దేవరపల్లి మండలం బందపురం నుంచి యర్నగూడెం మీదుగా త్యాజంపూడి వరకు గోపాలపురం నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు ప్రచారం సాగింది. ఈ కార్యక్రమానికి మద్దతుగా టిడిపి రాష్ట్ర ప్రచార కాంపైనర్ వంగవీటి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, జనసేన ఇన్‌ఛార్జి దొడ్డిగార్ల సువర్ణ రాజు, టిడిపి నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, జనసేన నాయకులు అనిసెట్టి గంగరాజు, కంబాల సత్తిబాబు, శ్రీను పాల్గొన్నారు.



బీమా ఏజంట్లతో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

జీవిత బీమా ఏజెంట్లకు సహకారం అందిస్తాం

ప్రజాశక్తి-కడియం

ఎంతో మంది జీవితాలకు భరోసా కల్పించడానికి, వారి కుటుంబాలకు శ్రేయోభిలాషిగా ఉండే ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్‌కు తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని టిడిపి రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ఎంఎల్ఎ అభ్యర్థులు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి హామీ ఇచ్చారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ జీవిత బీమా ఏజెంట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో భారీగా ఏజెంట్లు ఆదిరెడ్డి వాసును, గోరంట్ల బుచ్చయ్య చౌదరిని వారి కార్యాలయాల వద్ద కలిశారు. ఈ సందర్భంగా ఏజెంట్లు వారి పరిస్థితిని, మార్కెట్‌లో ఉన్న ఇబ్బందులను వివరించారు. చాలా మంది ఏజెంట్లను పలు పథకాలకు అర్హులు కారంటూ పథకాలు తొలగించారన్నారు. ఏజెంట్లకు సమావేశం వంటి కార్యకలాపాల నిర్వహణకు ఎన్నో ఏళ్ల నుంచి సొంత భవనం లేదన్నారు. రూరల్ బ్రాంచ్‌లో 650 మందికి పైగా ఏజెంట్లు ఉన్నారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఏజెంట్లకు తోడ్పాటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆదిరెడ్డి, గోరంట్ల హామీ ఇచ్చినట్లు సాయిబాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మట్టా సత్యనారాయణ, సెక్రటరీ రవికుమార్, ట్రెజరర్ వై.మోహన్, డివిజనల్ ఇసి మెంబర్ కొత్త సత్యనారాయణ అధిక సంఖ్యలో ఏజెంట్స్ పాల్గొన్నారు.

నల్లమిల్లిలో ఆనందరావు ప్రచారం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

నల్లమిల్లిలో టిడిపి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నల్లమిల్లి గ్రామ సర్పంచ్ గోకరకొండ శ్రీనివాసు ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లపై యువత భారీ సంఖ్యలో ఆనందరావు వెంట ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి తమకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

తాళ్లరేవులో రూ.15 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ రహదారి 216లోని పి.మల్లవరం చెక్ పోస్ట్ వద్ద సోమవారం రూ.15 లక్షల నగదును అధికారులు సీజ్ చేశారు. ఎస్ఐబి మొబైల్ టీం ఎస్ఐ రామశేషయ్య తెలిపిన వివరాల ప్రకారం..యానాం వైపు నుంచి కాకినాడ వైపుకు పివిఎస్.భాస్కర సుబ్రహ్మణ్య రామరాజు, మందపాటి మహేష్ అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంపై నగదును తరలిస్తుండగా తనిఖీలలో పట్టుకున్నామన్నారు. అయితే ఆ నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో బోర్డర్ మొబైల్ పార్టీ టీం, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం-2, చెక్ పోస్ట్ సిబ్బంది సమక్షంలో నగదును సీజ్ చేసినట్లు రామశేషయ్య తెలిపారు.



9.5 కేజీల బంగారం సీజ్

ప్రజాశక్తి - కొత్తపేట

సరైన పత్రాలు లేనందుకు 9.530 కేజీల బంగారం, 1,871 కేజీ వెండి వస్తువులను అధికారులు సీజ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో విజయవాడ వైపు నుంచి అమలాపురం వైపుకు బివిసి లాజిస్టిక్స్ వాహనంలో వీటిని తరలిస్తున్నారు. గోపాలపురం చెక్‌పోస్టు వద్ద అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎస్ఎస్‌టి టీం ఇన్‌ఛార్జి, రావులపాడు పంచాయతీ సెక్రెటరీ ఎం.పట్టాభిసీతారామయ్య, రావులపాలెం సిఐ ఆంజనేయులు, సిబ్బంది విజయ్‌కుమార్, రాజశేఖర్ ఆధ్వర్యంలో వాటిని సీజ్ చేశారు. వీటి విలువ ఆరు కోట్ల 70 లక్షల 16, 362 రూపాయలు ఉంటుందని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వీటిని ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

కాకినాడ బరిలో నిలిచింది వీరే...

కాకినాడ జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు 108 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పార్లమెంట్ బరిలో 15 మంది, అసెంబ్లీ బరిలో 93 మంది బరిలో పోటీలో నిలిచారు. పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.

నియోజకవర్గం	బరిలో మొత్తం	అభ్యర్థి	అభ్యర్థి	అభ్యర్థి
కాకినాడ సిటీ	15	ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి – వైసిపి	వనమాడి వెంకటేశ్వరరావు – టిడిపి	చెక్కా నూకరాజు – కాంగ్రెస్
కాకినాడ రూరల్	15	కురసాల కన్నబాబు – వైసిపి	పిల్లి సత్యలక్ష్మి – కాంగ్రెస్	పంతం నానాజీ – జనసేన
తుని	11	దాడిశెట్టి రాజా – వైసిపి	యనమల దివ్య – టిడిపి	గేలం శ్రీనివాసరావు – కాంగ్రెస్
ప్రత్తిపాడు		వరుపుల సుబ్బారావు – వైసిపి	వరుపుల సత్యప్రభ – టిడిపి	ఎన్‌వివి.సత్యనారాయణ – కాంగ్రెస్
పెద్దాపురం	10	దవులూరి దొరబాబు – వైసిపి	నిమ్మకాయల చినరాజప్ప – టిడిపి	తుమ్మల దొరబాబు – కాంగ్రెస్
జగ్గంపేట	14	తోట నరసింహం – వైసిపి	జ్యోతుల నెహ్రూ – టిడిపి	ఎంవివి.గణేశ్వరరావు – కాంగ్రెస్
పిఠాపురం	13	వంగా గీత – వైసిపి	కొణిదెల పవన్‌కళ్యాణ్ – జనసేన	మాదేపల్లి సత్యానందరావు – కాంగ్రెస్

పాటంశెట్టి సూర్యచంద్రకు గాజు గ్లాసు గుర్తు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో జనసేన పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీలో దిగిన పాటంశెట్టి సూర్యచంద్రకు గాజు గ్లాసు గుర్తును కేటాయించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణ అనంతరం తుది జాబితాను అధికారులు కేటాయించారు. పాటంశెట్టి సూర్యచంద్ర స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆయనతో పాటూ మరికొందరు స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాటంశెట్టితో పాటూ మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు గాజు గ్లాసు గుర్తును కోరుకున్నారు. దీంతో ముగ్గురికి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు లాటరీ వేశారు. ఈ లాటరీలో పాఠంశెట్టి సూర్యచంద్రకు గాజు గ్లాసు గుర్తు వచ్చింది. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ కొన్ని లక్షల సార్లు గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించామని, భగవంతుడు కరుణించి లాటరీ ద్వారా గాజుగుర్తు లభించిందన్నారు. 2019 ఎన్నికల నాటి నుంచి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ప్రతి ఇంటికి ఎనిమిది సార్లు తిరిగానని గుర్తు చేవారు. తాను తన భార్య కష్టపడినందుకు కష్టం ఫలించిందన్నారు. గాజుగ్లాసు గుర్తు రావడం తమ మొదటి విజయంగా భావిస్తున్నానని తెలిపారు.


మీడియాకు గాజుగ్లాసును చూపుతున్న సూర్యచంద్ర

డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమలో...

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు 106 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పార్లమెంట్ బరిలో 15 మంది, అసెంబ్లీ బరిలో 91 మంది బరిలో పోటీలో నిలిచారు.

నియోజకవర్గం	బరిలో మొత్తం	అభ్యర్థి	అభ్యర్థి	అభ్యర్థి
అమలాపురం	13	పినిపే విశ్వరూప్ – వైసిపి	అయితాబత్తుల ఆనందరావు – టిడిపి	అయితాబత్తుల సుబాషిణి – కాంగ్రెస్
ముమ్మిడివరం	15	పొన్నాడ సతీష్‌కుమార్ – వైసిపి	దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) – టిడిపి	పాలెపు ధర్మారావు – కాంగ్రెస్
కొత్తపేట	13	చిర్ల జగ్గిరెడ్డి – వైసిపి	బండారు సత్యనారాయణ – టిడిపి	రౌతు ఈశ్వరరావు – కాంగ్రెస్
రామచంద్రపురం	13	పిల్లి సూర్యప్రకాష్ – వైసిపి	వాసంశెట్టి సుభాష్ – టిడిపి	కోట శ్రీనివాసరావు – కాంగ్రెస్
రాజోలు	10	గొల్లపల్లి సూర్యారావు – వైసిపి	దేవ వరప్రసాదరావు – జనసేన	సరెళ్ల ప్రసన్నకుమార్ – కాంగ్రెస్
పి.గన్నవరం	14	విప్పర్తి వేణుగోపాలరావు – వైసిపి	గిడ్డి సత్యనారాయణ – జనసేన	కొండేటి చిట్టిబాబు – కాంగ్రెస్
మండపేట	13	తోట త్రిమూర్తులు – టిడిపి	వేగుళ్ల జోగేశ్వరరావు – టిడిపి	కామన ప్రభాకరరావు – కాంగ్రెస్

ఇక మిగిలింది రెండు వారాలే...

- బలాలపై అభ్యర్థుల బేరీజు
- సామాజిక వర్గాల వారీగా సభలు సమావేశాలు
- గెలుపే లక్ష్యంగా ముమ్మర ప్రయత్నాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎన్నికల రణరంగంలో తాడోపేడో తేల్చుకోవడానికి మూడువారాలే మిగిలింది. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ పూర్తయిన విషయం విధితమే. ఇప్పటివరకు జరిగే తంతు ఒక ఎత్తు, ఇక ముందు జరగబోయేది ఇంకో ఎత్తు. ఎన్నికల బరిలో నిలిచేదెవరు అనే విషయమై మరో 24 గంటల్లో స్పష్టత రానుంది. అయితే ఈ తరుణంలోనే అధికార విపక్ష పార్టీల అభ్యర్థుల రోజువారీ కదలికలపై ఎన్నికల నిబంధనల నీడ వెంటాడటంతో అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే కొందరు అభ్యర్థులు దీన్ని దృష్టిలో పెట్టుకుని అన్నీ సర్దేసినట్టు చెబుతున్నారు. సామాజిక వర్గాలు, మహిళా గ్రూపులు, యువత టార్గెట్‌గా అంతా వ్యవహారం సాగుతోంది. జిల్లాలో నియోజక వర్గాల వారీగా ఎంపీ అభ్యర్థులు కీలక పాత్ర పోషిస్తున్నారు. బలం, బలహీన తలను అంచనా వేసు కునే పనిలో పడ్డారు.

ఓవైపు అధికార యంత్రాంగం, ఎన్నికల సంఘం ప్రతి విషయాన్ని ఆరా తీస్తుంది. ఇప్పటికే అభ్యర్థు లంతా గడిచిన నెలన్నర రోజులుగా విస్తృత ప్రచారం చేశారు. అన్ని వర్గాలను తమవైపు తిప్పుకోవడానికి ఎత్తులు, పై ఎత్తులు వేశారు. అధికార వైసిపితో పాటు టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులు ఇప్పటికే ఏడు నియోజక వర్గాల పరిధిలో ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఎన్నికల వ్యూహంలో పదునుగా వ్యవహరించడం, ఏ నియోజక వర్గం లో ఎలాంటి ప్రధాన సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారు, వాటి పరిష్కార మార్గాలు, తాను చేయబోయే పనుల గురించి ప్రతిపక్ష కూటమి అభ్యర్థులు ఎకరువు పెడుతుండగా ఇంకోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు గడిచిన ఐదేళ్లలో ఆగిన అభివృద్ధి, సంక్షేమ జపం చేస్తున్నారు. ఒకవైపు మండుటెండలు కాస్తున్నా ఖాతరు చేయకుండా ప్రచారాన్ని సాగిస్తున్నారు.

వైసిపిని అధికారం దూరం చేయటమే తన లక్ష్యం అంటూ జనసేన అధినేత ఇప్పటికే ప్రకటించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలోనే జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. జనసేన అభ్యర్థులు పోటీ చేసే చోట అధికార పార్టీ ఎంఎల్ఎలపైన నిప్పుడు చెరుగుతున్నారు. సామాజిక వర్గాలను ఆకట్టుకునే క్రమంలో ఒక సామాజిక వర్గంతో అధికారపార్టీ ప్రసన్నానికి ప్రయత్నిస్తే, టిడిపి కూటమి నేతలు ఆ సామాజికవర్గం నుంచే తమకు మద్దతు దక్కేలా జాగ్రత్తలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే రాజమహేంద్రవరం సిటీ నియోజక వర్గంలో వంగవీటి రాధా టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు తరుపున ప్రచారం చేసిన విషయం విధితమే. వైసిపి అభ్యర్థి మార్గాని భరత్ రామ్ సిద్ధం సభకు అంబటి రాంబాబు, పేర్ని నాని, కొడాలి నాని తదితరులను ఆహ్వానించారు. రాజమండ్రి రూరల్ నియోజక వర్గ వైసిపి అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు మద్దతుగా ముద్రగడ పద్మనాభం తన సామాజిక వర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరికి మద్దతుగా జనసేన జిల్లా అధ్యక్షులు, నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల్లో తమకు ఎలాంటి మద్దతు లభిస్తుంది? ఏఏ వర్గాల నుంచి సాను కూలత ఉంది?అనే సమాచారంపై స్పష్టత రావటంతో ఎవరికి వారు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. యువత, రైతులు, మహిళల్లో ఎంతెంత శాతం తాము మొగ్గుచూపుతారనే దానిపై ఇప్పటికే పల్లె, పట్టణం తేడా లేకుండా తాము ప్రచారం చేసిన ప్రాంతాలన్నింటిలోనూ ఇరు పార్టీలు అంచనాలు వేస్తున్నాయి. ఈ అంచనాలకు తగ్గట్లుగా కార్యచరణ రూపొందిస్తున్నాయి. రాబోయే మూడువారాలు పోటీచేసే అభ్యర్థు లకు అత్యంత కీలకం కావటంతో ఈ సమయంలో ఇరు పార్టీలలో కార్యకర్తల వలసలు అభ్యర్థులకు తలపోటులా మారాయి. కార్యకర్తలను నిలబెట్టుకు నేందుకు అభ్యర్థులు అష్టకష్టాలు పడుతున్నారు. ఒక టికి రెండుసార్లు పోలింగ్ బూత్‌ల స్థాయిలోనూ అంచనాలకు దిగుతున్నారు.


పిఠాపురంలో రోడ్‌షో నిర్వహిస్తున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

తూర్పుగోదావరి బరిలో...

తూర్పు గోదావరి జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు 83 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పార్లమెంట్ బరిలో 12 మంది, అసెంబ్లీ బరిలో 71 మంది బరిలో పోటీలో నిలిచారు.

నియోజకవర్గం	బరిలో మొత్తం	అభ్యర్థి	అభ్యర్థి	అభ్యర్థి
రాజమహేంద్రవరం సిటీ	10	మార్గాని భరత్ – వైసిపి	ఆదిరెడ్డి శ్రీనివాస్ – టిడిపి	బోడా వెంకటలక్ష్మీప్రసన్న – కాంగ్రెస్
రాజమహేంద్రవరం రూరల్	7	చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ – వైసిపి	గోరంట్ల బుచ్చియ్య చౌదరి – టిడిపి	బాలేపల్లి మురళీధర్ – కాంగ్రెస్
అనపర్తి	9	సత్తి సూర్య నారాయణరెడ్డి – వైసిపి	నల్లమిల్లి రామకృష్ణారెడ్డి – బిజెపి	ఎల్లే శ్రీనివాసరావు – కాంగ్రెస్
గోపాలపురం	10	తానేటి వనిత – వైసిపి	మద్దిపాటి వెంకట్రాజు – టిడిపి	ఎస్.మార్టిల్ లూథర్ – కాంగ్రెస్
కొవ్వూరు	11	తలారి వెంకట్రావు – వైసిపి	ముప్పిడి వెంకటేశ్వరరావు – టిడిపి	ఎ.అరుణకుమారి – కాంగ్రెస్
నిడదవోలు	12	జి.ఎస్.నాయుడు – వైసిపి	కందుల దుర్గేష్ – జనసేన	పెద్దిరెడ్డి సుబ్బారావు – కాంగ్రెస్
రాజానగరం	12	జక్కంపూడి రాజా – వైసిపి	బత్తుల బలరామకృష్ణ – జనసేన	ఎం.వి.శ్రీనివాస్ – కాంగ్రెస్

ఎన్నికల ఖర్చుపై డేగ కన్ను

ప్రచార ఆర్భాటంపైనా నిఘా
ఖర్చు చేసిన ప్రతి రూపాయికీ లెక్క చెప్పాల్సిందే..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార, విపక్ష పార్టీలు ప్రచారాన్ని కొత్తపుంతలు తొక్కిస్తాయి. గెలిస్తే చేయనున్న పనులు, హామీ లు, గతంలో నెరవేర్చిన వాగ్దానాలు గుప్పిస్తున్నాయి. ప్రత్యేక నినాదాలు తదితర అంశాలతో ప్రచార సామగ్రిని సైతం సిద్ధం చేశాయి. ఓటర్లను ఆకట్టుకుని తమ వైపునకు తిప్పుకోవడం ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం కరపత్రాలు, గోడపత్రికలు, ఫ్లెక్సీలు ముద్రిస్తుంటారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రచారానికి సంబంధించిన ప్రచురణలకు తప్పనిసరిగా మార్గదర్శకాలు పాటించాల్సిందే. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు. జిల్లాలోని పార్లమెంటు ఒక పార్లమెంటు స్థానంతో పాటు ఏడు నియోజక వర్గాలలోనూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే ప్రచారం హోరెత్తుతోంది. ఆయా పార్టీల నేతలు రాష్ట్ర నాయకత్వం పంపిన ప్రచార సామగ్రితో పాటు స్థానికంగా సిద్ధంచేసిన వాటితోనూ రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో ప్రచురణలపై ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రత్యేక ఉత్తర్వులు అనుసరించకపోతే ఇబ్బందులు తప్పవు. పత్రికల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రత్యేకంగా ఏ అభ్యర్థి తరఫున అయినా ప్రకటనలు ఇచ్చేందుకు ముద్రించే వారి పేరు, ప్రచురణ కర్త, ముద్రించిన ప్రకటన ప్రతిని సమర్పించాలి.ముద్రణ పూర్తయ్యాక డిక్లరేషన్ ప్రతితో పాటు ముద్రించిన ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలి.జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా ఎన్నికల అధికారి అధ్యక్షతన ఏర్పాటవుతుంది. 2004 ఏప్రిల్ 13న సుప్రీంకోర్టు ఉత్తర్వులు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ప్రకారం ఈ కమిటీ నెలకొల్పారు. కమిటీ సభ్యులు స్థానిక వార్తా పత్రికలు,



మ్యాగజైన్లు, కరపత్రాలు, గోడపత్రాలను పరిశీలిస్తారు.ఏ రాజకీయ పార్టీ నేత, అభ్యర్థి అయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా లేదా రెండూ విధించే అవకాశముంది.ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సంబంధించి రాత ప్రతులు, సీడీ రెండు కాపీలు కమిటీ ఆమోదం కోసం 72 గంటల ముందుగా సమర్పించాలి. ప్రకటన ప్రసారం చేయాలనుకుంటున్న వ్యక్తి పూర్తి సమాచారం అందులో ఉండాలి.ప్రకటనల తయారికి అయ్యే ఖర్చు, ప్రసార మాధ్యమాల్లో ప్రసారానికి అయ్యే ఖర్చు తెలపాలి.పోలింగ్ రోజు, అంతకుముందు రోజు ప్రింట్ మీడియాలో వచ్చే ప్రకటనలకు ఎంసీఎంసీ ఆమోదం తప్పనిసరి.పోటీచేసే అభ్యర్థి సామాజిక మాధ్యమ ఖాతా వివరాలను నామినేషన్ వెంట సమర్పించే ఫారం-26లో స్పష్టంగా పేర్కొనాలి.అభ్యర్థి లేకుండా ఇతర వ్యక్తులు ప్రకటనలు ఇస్తే అందుకు సంబంధించిన ప్రమాణ పత్రం దాఖలు చేయాలి.కుల, మతపరమైన ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు, ప్రలోభాలకు గురిచేయడం నిషేధం.రేడియో, ప్రైవేట్ ఎఫ్ఎం, టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియాపైనా పర్యవేక్షణ ఉంటుంది. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంటుంది.గోడపత్రాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రించే వ్యక్తి డిక్లరేషన్ తాలూకు రెండు ప్రతులను వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరి సంతకాలతో ప్రింటర్‌కు ఇవ్వాలి. డిక్లరేషన్ నమూనాను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నుంచి పొందాలి.